# మూడు ఖూనీలు ఆరు లూటీలు

"అక్కా! ఈసారైనా నేను పోటీచేయడానికి బావగారిచేత టిక్కెట్టిప్పించకపోతే ఊరుకునేది లేదు. కిందటిసారంటే నాకు పాతికేళ్ళు నిండలేదు కనుక పోటీచేసే అవకాశం లేకపోయింది కాని ఈసారి నాకు బావగారు టిక్కెట్టిప్పించకపోతే సహించేది లేదు'' అన్నాడు రాజకీయనాయకుని బావమరిది.

"అలాగేలేరా! బావగారికి చెబుతానుగా!" అంది అక్క

"అలా ఇలా చెప్పడం కాదు. చాలా స్ట్రాంగ్‌గా చెప్పాలి. నేనీలోగా పత్రికా విలేఖరుల గోష్ఠి జరిపి, నేనే అభ్యర్థినని ప్రకటించేస్తాను'' హెచ్చరించాడు బావమరిది.

"అలాగే! బావగారు రాగానే చెప్తాన్రా'' అంది అక్క

ఇంతలో రాజకీయనాయకుడు రానే వచ్చాడు.

రాత్రి భోజనాలయేక శయనమందిరంలో రాజకీయనాయకుని భార్య అంది.

"ఏవండీ! ఈసారి రాబోయే ఎన్నికల్లో పోటీచెయ్యడానికి టిక్కెట్టిప్పించకపోతే ఊరు కునేది లేదని మా తమ్ముడు హెచ్చరించాడండీ! కిందటిసారంటే పాతికేళ్ళు నిండలేదని టిక్కెట్టివ్వ లేకపోయారు కాని, పాతికేళ్ళు నిండేయి కనుక మీరు వాడికెలాగైనా టిక్కెట్టిప్పించకపోతే వీల్లేదు'' డొక్క చించేస్తాను అన్నట్లు మాట్లాడింది రాజకీయ నాయకుని భార్య " అలాగేలేవే తప్పకుండా ప్రయత్నిస్తా '' అన్నాడు రాజకీయనాయకుడు ఈలోగా తనకు టిక్కెట్టు ఖరారయిపోయిందని ప్రచారం చేసేసుకుంటున్నాడు బావమరిది. సినిమా పోస్టర్లంటించే అబ్బాయికి పోస్టర్లంటించమని బెత్తాయించాడు.వివిధ గృహ యాజమానుల అనుమతితో ఫలానా అభ్యర్థి పోటీ చేయబోతున్నాడని గోడలమీద రాయించేశాడు.అందరికంటే ముందుగా ప్రచారపు హోరు ఎత్తించేస్తున్నాడు. అధిష్ఠానవర్గం

సరైన అభ్యర్థులెవరో తెలుసుకుని రమ్మని ఒక పరిశీలకుల బృందాన్ని పంపించింది. ఆ కమిటీవారు రాజకీయనాయకుని బావమరిది పోటీ చేద్దామనుకున్న నియోజక వర్గానికి వచ్చారు. పోటీ చేద్దామనుకున్న అభ్యర్థుల్ని ఒక్కొక్కర్నే ఇంటర్వ్యూ చేశారు పరిశీలకులు. రాజకీయ నాయకుని బావమరిది ఓ యాభై లారీలు, వంద స్కూటర్లు,ట్రాక్టర్లు వెంటవేసుకుని మద్దతుదార్లతో వచ్చి తన విశ్వరూపం చూపించాడు! మిగతా అభ్యర్థులెవరూ ఇంత భారీ ప్రదర్శన ఏర్పాటుచేసుకోలేకపోయారు. అతనికి టిక్కెట్టివ్వడం ఖాయం అనుకున్నారందరూ. తానొకటి తలిస్తే అన్నట్టు బావమరిది ఒకటి తలిస్తే అధిష్ఠానవర్గం ఇంకోలా తలచింది.బావమరిదికి టిక్కెట్టు హుళక్కి అయింది. రాజకీయనాయకుని శ్రీమతి భగ్గుమంది భర్తమీద! ధుమధుమలాడుతున్న ధూమకేతు వయింది లావా ప్రవహించే జ్వాలాముఖి అయింది. రాజకీయ నాయకుడు శాంతంగా-దీనంగా,జాలిగా,తన నిస్సహాయతకు చింతిస్తూ అన్నాడు. "చూడు శ్రీమతి! మూడు ఖూనీలు-ఆరులూటీలు అన్న మాట విన్నావు కదా? మీ తమ్ముడుకనీసం ఒక్క ఖూనీ అన్నా చేయలేదుకదా? అదే కనిసార్హతాయె! అందుకే అధిష్ఠానవర్గం మీ తమ్ముడికి టిక్కెట్టివ్వడానికి నిరాకరించింది. నన్నేం చేయమంటావు చెప్పు! "

నవంబరు 2001

చతుర మాసపత్రిక